హ్యాట్రిక్ సాధించాలని ప్రత్యేక పూజలు



మణికొండ: గత రికార్డులను తుడిచేసి దక్షిణాదిలో బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సాధించాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు పూజలు చేశారు. నార్సింగి మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు శివారెడ్డి, పత్తి ప్రవీణ్‌ల ఆధ్వర్యంలో నాయకులు తుల్జాభవాని దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రేపు వెలువడే ఎన్నికల ఫలితాల్లో తమ మొక్కులు తీరతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు గోపాలగణేష్, నాయకులు రఘు, విశ్వనాథ్, సునీల్ తదితరులున్నారు.

3న బాలబృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం చిల్డ్రన్స్ వీక్లీ కార్యక్రమంలో భాగంగా 'బాలబృందావనం' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 'ది గేమ్ ఆఫ్ కర్మా' పేరిట నిర్వహించే కార్యక్రమంలో 9 నుంచి 14 ఏళ్ళ లోపు పిల్లలకు పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040-23001234లో సంప్రదించవచ్చు.

గెలుపు అంచనాపై అయోమయం

- ఓటర్ల తీర్పుపై నాయకులు బిజీ
- గెలుపు ఎవరిని వరిస్తుందోనన్న ఆసక్తితో నేతలు



శంషాబాద్ రూరల్: పోలింగ్ ముగిసినా.. ఓటర్ల నాడి ఏమిటన్నది తేలడం లేదు. ఏ పార్టీకి ఓటు వేశారో తెలుసుకోలేక రాజకీయ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. గెలుపు ఎవరిని వరిస్తుందో అంచనా వేయలేక సతమతమవుతున్నారు. నవంబర్ 30న జరిగిన సాధారణ ఎన్నికల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీ అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. అయితే అన్ని పార్టీల అభ్యర్థులు ఓటర్లను మచ్చిక చేసుకోవడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేశారు. డబ్బు, మద్యం పంపిణీ జరిగినా అధికారులు, పోలీసులు కట్టడి చేయలేకపోయారు.

ఓటర్లు.. ఎటువైపు..

ఎన్నికల ముందురోజు నుంచి పోలింగ్ చివరి వరకు గ్రామాల్లోని నాయకులు ఓటర్ల మనోగతం తెలుసుకోవడంతో పాటు ప్రచారంపై దృష్టి పెట్టారు. అన్ని ప్రధాన పార్టీలు ఓటర్లకు తాయిళాలు అందజేయగా.. అన్ని పార్టీల అభ్యర్థుల మనసు నొప్పించక.. మా ఓటు మీకే అంటూ ఓటర్లు తెలివిగా వ్యవహరించారు.

ఎటువైపు మొగ్గు..

హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గుర్తింపు ఉన్న ప్రకాష్‌గౌడ్ నాల్గోసారి గెలుపు ఖాయమని ఆ పార్టీ నాయకులు పైకి ధీమా వ్యక్తం చేస్తున్నా.. పోలింగ్ సరళిని పరిశీలన చేసుకుంటూ.. లోలోపల మధనపడుతున్నారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు మున్సిపల్ పరిధిలో బీఆర్ఎస్‌కు ఆధిక్యత వస్తుందని నాయకులు భావించారు. కాని పోలింగ్ రోజు జరిగిన పరిణామాలు గమనిస్తే వారి ఆశలకు భంగం కలిగేలా ఉన్నాయి. ఆయా గ్రామాల్లో చాలా చోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటాపోటీగా ఓట్లు దండుకున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో కొన్నిచోట్ల ఈ రెండు పార్టీలకు దీటుగా బీజేపీ కూడా ఓట్లను కొల్లగొట్టినట్లు సమాచారం. రెండు, మూడు గ్రామాల్లో బీజేపీ ఆధిక్యత కనబరిచేలా అంచనాలున్నాయి.

పథకాలపై బీఆర్ఎస్ ఆశలు..

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమను గెలిపిస్తాయని బీఆర్ఎస్ నాయకులు ఆశలు పెట్టుకున్నారు. కాని కొన్ని సంక్షేమ పథకాలు మాత్రం ఈ పార్టీకి నష్టం కల్గించినట్లు గ్రామాల్లో ఓటర్ల తీరుతో స్పష్టమవుతోంది. దళితబంధు, బీసీబంధుతో అతి కొంతమందికి మాత్రమే లబ్ధిచేకూరిందని ఆయా సామాజికవర్గం ఓటర్లు ఆగ్రహంతో కనిపించారు. ఇక రైతుబంధు కూడా పెద్ద రైతులకు ఇవ్వడంపై చిన్న, సన్నకారు రైతులతో పాటు రైతుకూలీలు అసహనంతో ఉన్నారు. ఆసరా పెన్షన్ల లబ్ధిదారుల్లో కూడా అసంతృప్తి వ్యక్తమవుతోంది.

అంచనాలేని ఓటర్ల మనోగతం..

చివరకు ఓటు ఎవరికి వేశారో కూడా పైకి తెలియకుండా ఓటర్లు తమ మనోగతాన్ని బహిర్గతం చేయకపోవడంతో పలు పార్టీల నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ఏ పార్టీ నాయకులు అడిగినా.. మా ఓటు మీకే వేశామంటూ.. చెబుతుండటంతో ఓటింగ్ సరళిపై నాయకులు సరైన అంచనాకు రాలేకపోతున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ నాయకుల్లో ఆందోళన కనిపిస్తోంది. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను కాంగ్రెస్, బీజేపీ ఓట్లుగా మల్చుకోవడంలో ఒకింత సఫలమైనట్లు కనిపిస్తోంది. ఫలితాల వెల్లడికి ఒకరోజు మాత్రమే ఉండటంతో అప్పటి వరకు నాయకులు ఎవరి అంచనాల్లో వారు ఉన్నారు.

28 టేబుళ్లు.. 20 రౌండ్లు

రాజేంద్రనగర్: నియోజకవర్గంలో పోలైన ఓట్ల లెక్కింపు కోసం లార్డ్స్ కళాశాలలో రిటర్నింగ్ అధికారి మల్లయ్య ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లను చేపడుతున్నారు. నియోజకవర్గంలో 542 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఈవీఎంలను ఇప్పటికే స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలను ఈ స్ట్రాంగ్‌రూమ్ వద్ద 24 గంటల బందోబస్తు ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఓట్ల లెక్కింపు కోసం 28 టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొత్తం పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కోసం 20 రౌండ్‌లను నిర్ణయించారు. ప్రతి రౌండ్‌లో 28 బూత్‌లకు సంబంధించిన ఓట్లను లెక్కించనున్నారు. ప్రతి రౌండ్ 30-45 నిముషాల సమయం పడుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ లెక్కన తుది ఫలితానికి 8 గంటల సమయం పట్టనుంది. ప్రతి టేబుల్‌లో 28 ఈవీఎంలకు చెందిన ఓట్లను లెక్కించి రౌండ్‌ల వారీగా ప్రకటించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ ప్రక్రియ 3న ఉదయం 7.30 గంటల నుంచి ప్రారంభం కానుంది. నియోజకవర్గంలో అత్యధిక పోలింగ్ బూత్‌లు ఉండటంతో లెక్కింపు ప్రక్రియ ఆలస్యం కానుంది. దాదాపు 8-10 గంటల సమయం పట్టొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి తగిన ఏర్పాట్లు చేపడుతున్నారు.

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ప్రత్యేక ఏర్పాట్లు

రాజేంద్రనగర్: నియోజకవర్గ పరిధిలోని పోస్టర్ బ్యాలెట్ల లెక్కింపు కోసం లార్డ్స్ కళాశాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 2,209 పోస్టర్ బ్యాలెట్లు అందాయి. వీటితో పాటు వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న వారు పోస్టర్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు శనివారం ఉదయానికి రిటర్నింగ్ అధికారికి చేరనున్నాయి. ప్రస్తుతం స్ట్రాంగ్‌రూమ్‌లో 2,209 ఓట్లను భద్రపరిచారు. రాష్ట్రవ్యాప్తంగా మరికొన్ని పోస్టల్ బ్యాలెట్లు రానున్నాయి. దీంతో అధికారులు ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేకంగా గదిని ఏర్పాటు చేశారు. ఇందులో 500 ఓట్లను లెక్కించేందుకు ఒక టేబుల్‌ను ఏర్పాటు చేశారు. మొత్తం ఐదు టేబుళ్లను పోస్టల్ బ్యాలెట్లను లెక్కించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి టేబుల్‌పై 500 పోస్టల్ బ్యాలెట్లను లెక్కించేందుకు ఒక సూపర్‌వైజర్, ఒక అసిస్టెంట్ సూపర్‌వైజర్, ఒక ఏఆర్‌ఓతో పాటు సహాయకులను నియమించారు. ఉదయం 7.30 గంటలకు ఈ పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. వీటి ఫలితాలను ప్రకటించిన అనంతరం ఈవీఎంలను లెక్కించనున్నారు.

కీలకంగా సర్కిల్ మైనార్టీ ఓట్లు

రాజేంద్రనగర్: నియోజకవర్గ పరిధిలో రాజేంద్రనగర్ సర్కిల్ ఐదు డివిజన్ల మైనార్టీ ఓట్లు కీలకంగా మారాయి. అభ్యర్థుల గెలుపోటములను ఈ ఓట్లు ప్రభావితం చేయనున్నాయి. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు కలవరానికి గురౌతున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఐదు జీహెచ్ఎంసీ వార్డులు ఉన్నాయి. అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ మూడు డివిజన్లలో గతంలో బీజేపీ అభ్యర్థులు కార్పొరేటర్లుగా గెలిచారు. సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లలో మజ్లిస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. ప్రస్తుతం రాజేంద్రనగర్ నుంచి బీజేపీ కార్పొరేటర్ బీఆర్ఎస్‌లో చేరారు. ఐదు డివిజన్లలో మైనార్టీ ఓట్లు అత్యధికంగా ఉన్నాయి. రెండు డివిజన్లతో పాటు అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్లలో కొన్ని ఓట్లు మైనార్టీలవి ఉన్నాయి. ప్రస్తుతం వీరు వేసిన ఓట్లే అభ్యర్థుల జయాపజయాలను నిర్ణయించడంతో అందరూ వారి ఓట్లపై అంచనా వేస్తున్నారు. ఐదు డివిజన్లలో మొత్తం 1,60,636 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ ఓట్లలో అత్యధికంగా ఎవరూ ఓట్లు పొందుతారో వారే విజయం సాధించనున్నారు. మైనార్టీ ఓట్లు ఎవరి పక్షాన చేరాయన్నది ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. మైనార్టీ ఓట్లు అటు మజ్లిస్ తమకే పూర్తిస్థాయిలో ఓట్లు పడ్డాయని ధీమాలో ఉండగా... బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు మాత్రం తమకే మైనార్టీ ఓట్లు అనుకూలంగా పడ్డాయనే అంచనాలు వేసుకుంటున్నాయి. బీఆర్ఎస్ నాయకులు మాత్రం మైనార్టీలంతా తమ పక్షానే ఉన్నారని, వారందరి ఓట్లతో విజయం సాధిస్తామంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓటర్ల నాడి మాత్రం ఏ ఒక్కటీ అంతు చిక్కడం లేదు. ఎవరిని ప్రశ్నించినా.. మీకే ఓటు వేశామని చెబుతుండటంతో వీరి ఓట్లు కీలకంగా మారాయి. గత ఎన్నికల్లో మజ్లిస్ దాదాపు 48 వేల వరకు ఓట్లు సాధించింది. ప్రస్తుతం మజ్లిస్‌కు 50 వేల ఓట్లు పోలయ్యాయని బీజేపీ ధీమాగా ఉంది. కేవలం 5-6 వేలు మాత్రమే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు వచ్చి ఉంటాయని అంచనా వేస్తున్నారు.

శంషాబాద్ మండలంలోనే అత్యధిక ఓట్లు

రాజేంద్రనగర్: నియోజకవర్గంలో అత్యధికంగా శంషాబాద్ మండలంలో ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలోని 5,81,937 ఓట్లలో శంషాబాద్‌లోని 87,256 ఓట్లలో 63,658 ఓట్లు పోలయ్యాయి. అత్యధికంగా 72.95 ఓట్ల శాతం నమోదైంది. గండిపేట్ మండలంలో 1,79,627 ఓట్లలో 1,00,623 ఓట్లు పోలయ్యాయి. 56.01 శాతం ఓట్లు నమోదు ఉంది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలో అత్యధికంగా 1,60,636 ఓట్లు పోలు కాగా.. సర్కిల్‌లోని 3,15,054 ఓట్లలో 51 శాతం ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో మొత్తం 55.83 శాతం ఓట్ల పోల్‌తో సర్కిల్ పరిధిలోని మైనార్టీ ఓట్లు ప్రస్తుతం అభ్యర్థుల జయాపజయాలను శాసిస్తున్నాయి. గతంలో శంషాబాద్ మండలంలో మెజార్టీ వచ్చిన అభ్యర్థులే విజయం సాధిస్తూ.. వస్తున్నారు. మండలంలో ఎవరి అంచనాల్లో వారు తామే గెలుస్తామంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

గెలుపుపై నేతల ధీమా!

- ప్రధాన పార్టీల అభ్యర్థులు అనుచరులతో సమావేశం
- ఓటింగ్ శాతంపై ఆరా తీసిన నేతలు

రాజేంద్రనగర్: ఓటింగ్ ముగియడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపోటములపై తమ అనుచరులతో సమావేశాలను ప్రారంభించారు. శుక్రవారం ఉదయం నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్లు అందజేసిన పోలింగ్ సరళిపత్రాలు, స్థానికంగా పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంతో పాటు ఇతర పార్టీల అభ్యర్థులు ఉదయం నుంచి ఈ భేటీలలో తలామునకలయ్యారు. పోలింగ్ శాతం పెరగడం, తగ్గడానికి గల కారణాలు.. పోలింగ్‌లో ఎవరూ ఎక్కువగా ఓటు వేసేందుకు ఆసక్తి చూపారనే తదితర విషయాలపై చర్చించారు. ఉదయం భారీగా ఉన్న పోలింగ్ అనంతరం మందగించడం, సాయంత్రానికి క్యూలైన్లు పెరిగిపోవడం.. దానికి గల కారణాలను విశ్లేషించారు. ఎవరి అంచనాలను వారు విడివిడిగా తెలుసుకుంటూ.. ఒక నివేదికను తయారు చేశారు. ఆ నివేదికతో చివరగా ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో చర్చించి ఓ నిర్ణయానికి వచ్చారు. వచ్చిన డేటాకు అనుగుణంగా మరోసారి తీసివేతలు, కూడికలు చేసి ఖచ్చితంగా తమకు ఇంత ఓటింగ్ నమోదైందంటూ నిర్ధారణకు వచ్చారు. ఇదే సమయంలో ఇతర పార్టీ అభ్యర్థులకు ఎన్ని పోలయ్యాయి. వాటిపై నివేదికను తయారు చేయడంతో పాటు ఇతర పార్టీల్లో తమకు ఉన్న సంబంధాలను వాటిని జోడించి తుది నిర్ణయానికి వచ్చారు. వీటన్నింటిని పరిశీలించిన అనంతరం తాము గెలుపొందుతామంటూ.. తుది నిర్ణయానికి వచ్చారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్‌లు ఎవరికి వారే తాము గెలుస్తామంటూ తమ అనుచరులకు సందేశాలు అందించారు. దీంతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు తామే గెలుస్తున్నామంటూ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నారు. 3న దీనికి సంబంధించి తుది ఫలితం రానుంది. లార్డ్స్ కళాశాలలో ఉదయం 7.30 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. మధ్యాహ్నం లేదా సాయంత్రానికి ఫలితాలు విడుదలయ్యేలా అధికారులు చర్యలు ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

శంషాబాద్ రూరల్: స్నేహితుడి పుట్టినరోజు వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు నివాసి బొట్టు రంజిత్(28), సహద్యోగి అజయ్ కలిసి షాద్‌నగర్‌లోని స్నేహితుడు పుట్టినరోజు వేడుకకు బైక్‌పై నవంబరు 29న వెళ్లారు. 30న తెల్లవారుజామున తిరిగి వస్తుండగా.. తొండుపల్లి రైల్వే వంతెన దాటగానే బెంగళూరు జాతీయ రహదారిపై నిర్మాణంలో ఉన్న రోడ్డు పనుల వద్ద మట్టి దిబ్బలను వీరి బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న రంజిత్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనకాల కూర్చున్న అజయ్‌కు గాయాలవడంతో చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న టెంపో

నలుగురికి స్వల్ప గాయాలు

శంషాబాద్ రూరల్: ఆర్టీసీ బస్సును వెనక నుంచి టెంపో ట్రావెల్స్ వాహనం ఢీ కొనడంతో ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా డిపో బస్సు శుక్రవారం తెల్లవారుజామున కొండారెడ్డిపల్లి నుంచి బయలుదేరి హైదరాబాద్ వస్తోంది. మార్గ మధ్యలో పెద్దషాపూర్ బస్టాప్ వద్ద ప్రయాణికులను ఎక్కించుకుని బయలుదేరుతుండగా.. వెనక నుంచి టెంపో వాహనం వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో వెనక సీట్లో కూర్చున నలుగురు ప్రయాణికులు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు వెనక భాగం దెబ్బతింది. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంటి సంరక్షణ అవసరం

హఫీజ్‌పేట్ : ప్రతి ఒక్కరికి కంటి సంరక్షణ ఎంతో అవసరమని వాసన్ ఐ కేర్ చందానగర్ ఇంచార్జి, చీఫ్ సర్జన్ సీనియర్ కన్సల్టెంట్ సర్జన్ డాక్టర్ రతన్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం చందానగర్ గంగారంలోని వాసన్ ఐ కేర్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ వాసన్ ఐ కేర్ ఆసుపత్రి నిరుపేద, మధ్య తరగతి వారికి కూడా అందుబాటులో ఉందన్నారు. ఈ నెల 7 వ తేదీ నూతన యంత్ర పరికరాలతో ఆసుపత్రిని ప్రారంభిస్తున్నామన్నారు. సమావేశంలో డైరెక్టర్ డాక్టర్ వికాస్ జైన్, డాక్టర్లు మమత శెట్టి, రవికుమార్, ఖాలీద్ లతీఫ్, ప్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గంలో ఓటింగ్ శాతం

కొన్నిచోట్ల అత్యధికం, అత్యల్పంగా నమోదు



రాజేంద్రనగర్: నియోజకవర్గ పరిధిలో గురువారం నమోదైన పోలింగ్‌లో శంషాబాద్ మండల పరిధిలోని పోలింగ్ బూత్ 512 ఎంపీపీఎస్ రాయన్నగడ్డ రూమ్ నంబర్-1లోని పోలింగ్ బూత్‌ను అత్యధికంగా ఓటింగ్ శాతం నమోదైంది. ఈ బూత్‌లో మొత్తం 318 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 158 మంది పురుషులు కాగా.. 160 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించారు. ఈ బూత్‌లో నియోజకవర్గంలోని అత్యధికంగా 91.38 శాతం ఓటింగ్ నమోదైంది. ఇది ప్రస్తుతం పోలింగ్‌లో అత్యధికం.

- మైలార్‌దేవ్‌పల్లి, లక్ష్మీగూడ ఎంపీపీఎస్ పాఠశాలలోని 428 పోలింగ్ బూత్‌లో అత్యల్ప ఓటింగ్ శాతం నమోదైంది. ఇక్కడ కేవలం 31.07 శాతం ఓటింగ్ మాత్రమే జరిగింది. 399 ఓట్లలో 185 మంది పురుషులు, 214 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ బూత్‌లో మహిళలే అత్యధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని అన్ని బూత్‌ల కంటే ఈ బూత్‌లోని అతి తక్కువ ఓటింగ్ శాతం నమోదైంది. 542 బూత్‌లలో 90కి పైగా ఓటింగ్ శాతం 8 బూత్‌ల్లో నమోదైంది.



అనుచరులతో సమావేశమైన కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌ముదిరాజ్

పోలింగ్ సరళిపై ఆరా!

మణికొండ: ఎన్నికల పోలింగ్ సరళిపై అభ్యర్థులు ఆరా తీశారు. నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం జరిగిన పోలింగ్‌లో తమకు అనుకూలంగా ఎన్ని ఓట్లు పోలై ఉంటాయనే వివరాలను సేకరించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్ శుక్రవారం ఉదయం ఓ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం రోజంతా విరామం తీసుకుని సాయంత్రం తన అనుచరులతో పుప్పాల్‌గూడలో సమావేశమయ్యారు. వారి ద్వారా ప్రతి పోలింగ్‌బూత్‌లో జరిగిన పోలింగ్ సరళి, పోలైన ఓట్లు, వాటిల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఓట్లపై ఫోన్లు చేసి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో చివరి దశలో పార్టీ టికెట్ దక్కడం, తక్కువ సమయం ఉన్నా నాయకులు, కార్యకర్తలు పూర్తి స్థాయిలో కష్టపడి పనిచేశారన్నారు. కొన్నిచోట్ల కొందరైతే వారే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా భావించి ఎక్కువ ఓట్లు వేయించేందుకు కృషి చేశారన్నారు. నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పవనాలు వచ్చాయని, దీంతో గెలిచి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. తమకు సహకరించిన ప్రతి ఒక్కరికీ, మీడియాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కిరణ్‌కుమార్, కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, కో-ఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శివారెడ్డి తదితరులున్నారు.

రహదారులపై మూగజీవాల తిష్ట

తీవ్ర ఇబ్బంది పడుతున్న వాహనదారులు, ప్రజలు



బండ్లగూడ ప్రాంతంలో జాతీయ రహదారిపై ఆవులు, గేదెలు ఇలా..

బండ్లగూడ: రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై మూగ జీవాలను వదులుతుండటంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్, బండ్లగూడ, కిస్మత్‌పూర్, పీరంచెరువు, కాళీమందిర్ తదితర ప్రాంతాల్లో రోజూ ఉదయం, సాయంత్రంవేళల్లో మూగజీవాలు రోడ్లపై తిష్ట వేస్తున్నాయి. రద్దీగా ఉన్న ప్రాంతం కావడంతో తరచూ మూగజీవాలు ప్రమాదాలకు గురికావడంతో పాటు వాహనాదారులు సైతం కిందపడి గాయాలపాలవుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు...

మూగజీవాల యజమానులు వాటిని మేత కోసం వదులుతుండటంతో ఆవులు, గేదెలు, మేకలు తదితర జీవాలు ప్రధాన రహదారులపైకి వస్తున్నాయి. హైదరాబాద్-బీజాపూర్ జాతీయరహదారి కాళీమందిర్, పీరంచెరువు, బండ్లగూడ తదితర ప్రాంతాల్లో ఈ మూగజీవాలు రోడ్లపైకి వచ్చి చెట్లు, వ్యర్థాలను తింటున్నాయి. వాటిని తిన్న అనంతరం అవి రోడ్లపైనే కూర్చుండిపోతున్నాయి. దీంతో ఆ ప్రాంతం గూండా ప్రయాణించే వాహనదారులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

వాహనదారులకు ప్రమాదాలు..

మూగజీవాలను ప్రమాదం నుంచి తప్పించబోయి వాహనదారులు కిందపడి గాయాలకు పాలవుతున్నారు. కొంతమంది అతివేగంగా వచ్చి వాటిని ఢీ కొట్టడంతో అవి కూడా గాయపడుతున్నాయి.

అధికారులకు పలుసార్లు ఫిర్యాదులు..

ప్రధాన రహదారులు, జాతీయ రహదారులపై మూగజీవాలు వస్తున్నాయి. వీటిని నివారించాలని అధికారులకు పలుసార్లు ఫిర్యాదులు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు, వాహనదారులు చెబుతున్నారు. రోజూ ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వెల్లడిస్తున్నారు. దీనిపై అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకుని రోడ్లపై మూగజీవాలను వదులుతున్న యజమానులపై అపరాధ రుసుము విధించి, పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మనూలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ సయ్యద్ ఐనుల్ హసన్

రాయదుర్గం : ప్రస్తుత పరిస్థితి 'మనిషి వర్సెస్ మెషిన్' అన్నట్లుగా మారిందని మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం నిర్వహిస్తున్న 'ఇంజనీరింగ్ (ఆర్ఐసీఈ-2023)లో ఇంటిలిజెంట్ కంప్యూటింగ్‌లో పరిశోధనలు' అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఉర్దూ యూనివర్సిటీ, సెంట్రల్ అమెరికాలోని యూనివర్సిడాడ్ డాన్‌బాస్కో సహకారంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ప్రారంభసమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మనిషి మేధస్సు శాశ్వతమైన ఆధిపత్యాన్ని కలిగి ఉంటుందన్నారు. అనంతరం సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

అంతర్జాతీయ అనుసంధానమే లక్ష్యం

రాయదుర్గం: పారిశ్రామికవేత్తలను అంతర్జాతీయ అనుసంధానం చేయడమే డెల్లా లీడర్స్ క్లబ్ హైదరాబాద్ లక్ష్యమని వక్తలు పేర్కొన్నారు. నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని షెరటాన్ హోటల్‌లో శుక్రవారం రాత్రి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీరామ్ బిల్డర్ అండ్ డెవలపర్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాలాజీరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంటర్‌ప్రెన్యూర్ కమ్యూనిటీ బిల్డర్, జిమ్మీ మిస్త్రీ డెల్లా లీడర్స్ క్లబ్ హైదరాబాద్ చాప్టర్ బోర్డును ప్రకటించారు. అత్యంత క్యూరేటెడ టెక్నాలజీ ఎనేబుల్డ్ గ్లోబల్ ప్లాట్‌ఫామ్ అయిన డెల్లా లీడర్స్ క్లబ్ అనేది విజ్ఞాన మార్పిడి, జీవనశైలి మార్గదర్శకత్వం, సామాజిక బాధ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల నాయకులకు మద్దతు ఇచ్చే పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తోందన్నారు. కార్యక్రమంలో కొన్సెలేజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు ఎండీ సుహెల్ సేథ్, విశ్రాంత ఐఏఎస్ అధికారి బిపి ఆచార్య, ఐటీ నిపుణులు జేపి చౌదరి, బజాజ్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సీఈఓ కరణ్ బజాజ్ ప్రసంగించారు.

ఎవరి లెక్కలు వారివే!

- బూత్‌ల వారీగా లెక్కలేస్తున్న పార్టీలు
- గెలుపుపై అన్ని పార్టీల్లో ధీమా

మణికొండ: గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ఫలితాలు వచ్చేందుకు మరొక రోజు సమయం ఉండటంతో పోలింగ్ జరిగిన తీరు, ఆయా పోలింగ్ బూత్‌లలో పార్టీల బలాలు, పోలైన ఓట్లు, తమకు వచ్చే ఓట్లపై ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఎవరికి అనుకూలంగా వారి పార్టీ నాయకులు ఇచ్చే సమాచారాలను క్రోడీకరించి తమకే మెజార్టీ వస్తుందని, తామే గెలుస్తామని ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు.

- బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల మధ్య ఎన్నికల పోరు రసవత్తరంగా సాగింది. బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డికి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్‌కు మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలలో పట్టు ఉంది. ఎంఐఎం పార్టీకి శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌లలో అధికశాతం ముస్లిం ఓట్లు ఉండటంతో వారికి బలం ఉంది. ఇక మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ప్రకాష్‌గౌడ్ నాల్గోసారి ఎన్నికల బరిలో నిలవడం, ఎంఐఎం పార్టీకి పట్టున్న రెండు డివిజన్లను వదిలేస్తే ప్రతి పోలింగ్‌బూత్‌లోనూ అనుచరగణం ఉండటం, పార్టీ క్యాడర్ బలంగా ఉంది. ఇలా ఎవరి ప్రాంతాలు వారికి, నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉన్నాయనే కారణంతో పాటు గతంలో గెలిచిన రికార్డులు ఉండటంతో ఈసారి తమకే తమ ప్రాంతాలతో పాటు ఇతర మున్సిపాలిటీలు, డివిజన్లు, గ్రామాలలో తమ పార్టీ క్యాడర్ కష్టపడి పనిచేసింది కాబట్టి తమకు అనుకూలంగా తీర్పు ఉంటుందని పలువురు నేతలు భావిస్తున్నారు.



రాజేంద్రనగర్ నియోజకవర్గం

మైనార్టీ ఓట్లే కీలకం..

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మొత్తం 5,81,937 ఓట్లు ఉండగా అందులో 3,24,917 ఓట్లు పోలయ్యాయి. గత 2018 ఎన్నికల్లో 56.14 శాతం పోలింగ్ కాగా.. ఈసారి కొంత తగ్గి 55.83 శాతం మాత్రమే పోలింగ్ అయ్యింది. అందులో మైనార్టీ ఓట్లు ఏకంగా 80,000ల వరకు పోలయ్యాయి. గత కర్ణాటక ఎన్నికల్లో మైనార్టీలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారని, రాష్ట్రంలోనూ వారు ఈసారి అదే పాటించారా.. లేక యధావిధిగా బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలకే ఓటు వేశారా.. ఎంఐఎం పార్టీ సైతం తమ అభ్యర్థిని రంగంలోకి దింపడంతో వారికి ఎంత మంది ఓటు వేశారనే విషయంపైనే గెలుపోటములు ఆధారపడి ఉంటాయని రాజకీయ పండితులు చెబుతున్నారు.

- 2018 ఎన్నికల్లో నియోజకవర్గంలో మైనార్టీలు 40వేల మంది వరకు బీఆర్ఎస్‌కు ఓటు వేశారు. దీంతో ప్రకాష్‌గౌడ్‌కు 58,373 ఓట్ల మెజార్టీ సాధ్యమైందనే వాదన ఉంది. ఈసారి వారు యధావిధిగా బీఆర్ఎస్‌కే ఓటు వేశారా.. లేక కాంగ్రెస్ వైపు మొగ్గారా అనే విషయం తేలితేనే గెలుపు నిర్ధారణ అవుతుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఏ సామాజికవర్గం ఎటువైపు ఓటు వేసింది, ఎవరికి వారు పట్టం కట్టారనే విషయం ఆదివారం మధ్యాహ్నం లోపు ఎన్నికల ఫలితాలు వెలువడితే కాని స్పష్టత రాని పరిస్థితి ఉందని చాలామంది అభిప్రాయపడుతున్నారు.

జోరుగా బెట్టింగ్

గెలుపోటములతో పాటు స్థానంపై ఆసక్తి

రాజేంద్రనగర్: నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగ్ ఊపందుకుంది. గురువారం సాయంత్రం ఓటింగ్ ముగిసిన అనంతరం ఓటింగ్‌శాతాన్ని పరిశీలించిన పలువురు తామే గెలుస్తున్నామంటూ.. ఇతర పార్టీలు రెండో, మూడో స్థానంలో నిలుస్తాయంటూ.. బెట్టింగ్‌లను ప్రారంభించారు. గురువారం సాయంత్రం నుంచి ప్రారంభమైన బెట్టింగ్‌లు శుక్రవారం రాత్రి వరకు ఊపందుకున్నాయి. ప్రజా ప్రతినిధులతో పాటు నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు, చిన్నారులు సైతం బెట్టింగ్‌లో పాల్గొంటున్నారు. బండ్లగూడకు చెందిన ఒక ముఖ్య నాయకుడు తమ పార్టీ గెలుస్తుదంటూ.. లక్షల్లో బేరం ఆడినట్టు సమాచారం. దీనికి సంబంధించిన చెక్కులను సైతం రాసి మధ్యవర్తికి అందించాడు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ఈ బెట్టింగ్ ప్రక్రియ జోరుగా సాగుతోంది. తమ పార్టీ అభ్యర్థి గెలుస్తాడంటే.. కాదు తమ పార్టీ అంటూ.. బెట్టింగ్‌లో పాల్గొంటున్నారని వినికిడి.

మెజార్టీపై కనిపించని బెట్టింగ్.

ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రస్తుతం గెలుపోటములపైనే బెట్టింగ్‌లు కాస్తున్నారు. మెజార్టీపై ఏ ఒక్కరూ బెట్టింగ్ కాయడం లేదు. దీనికి గల ముఖ్య కారణం.. నాల్గు పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా ఈ ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించారు. ఓటింగ్ శాతం సైతం 55.83 శాతంగా ఉంది. గతంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ 70 వేల మెజార్టీని సాధించారు. ప్రస్తుతం బీజేపీ, మజ్లిస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు గట్టిపోటీ ఇవ్వడంతో మెజార్టీపై ఎవరూ అంతగా బెట్టింగ్ ఖాయడం లేదు. గెలిస్తే చాలన్న దానిపైనే బెట్టింగ్‌లు కొనసాగుతున్నాయి.

న్యాయవాదులు సేవా దృక్పథంతో పని చేయాలి

గోల్కొండ: న్యాయవాదులు సేవా దృక్పథంతో పని చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయనను ప్రముఖ న్యాయవాది మిర్జా ఎక్బాల్ అహ్మద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో ఎందరో పేదలు వివిధ రకాల కారణాల వల్ల కోర్టుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. కుటుంబ తగాదాలు, ఆస్తి తగాదాల కారణంగా ఎందరో కోర్టులకు వెళ్తున్నారని ఆయన అన్నారు. ఇటువంటి వారిలో చాలా మంది ఆర్థిక కారణాల వల్ల న్యాయవాదులను నియమించుకోవడంలో వెనుకాడుతున్నారని అన్నారు. కేసులను తీసుకునే ముందు న్యాయవాదులు తమ క్లైంట్ ఆర్థిక పరిస్థితిని కూడా పరిగణలోకి తీసుకోవాలని అన్నారు.